క్లుప్తంగా

10న మెగా పేరెంట్స్ మీటింగ్

పామర్రు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఈనెల 10వ తేదీన ఉదయం 9గంటల నుంచి మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పదో తరగతి పాస్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రస్తుతం కళాశాల్లో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

బ్యాంకింగ్ రంగంలో వృత్తి అవకాశాలపై అవగాహన

గుడివాడరూరల్: స్థానిక ఏఎస్ఆర్ కళాశాల్లో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ రంగంలో వృత్తి అవకాశాలపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.రవి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బ్యాంకింగ్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలుంటాయన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఉపాధి సాధించడం కోసం మార్కెట్‌లో అనేకరకమైన పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని చదవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్ఆర్‌కే ప్రసాద్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయించే దుకాణాలపై ప్రత్యేక డ్రైవ్

పామర్రు: పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్న పొగాకు ఉత్పత్తుల విక్రయంచే దుకాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. పామర్రు స్టేషన్ పరిధిలో సోమవారం ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల అమ్మకానికి ఏ విధమైన అనుమతులు లేవు అనే బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సూచించినట్లు ఆయన తెలిపారు.

ఫార్మసీ కళాశాల్లో వనమహోత్సవం


ముదినేపల్లి రూరల్: స్థానిక విజయ ఫార్మసీ కళాశాల్లో వనమహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ తనూజ, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా జూలై మొదటి వారంలో వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే కళాశాల ఆవరణలో ఔషధ మొక్కలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఔషధ వనంలో మొక్కల పెంపకం ద్వారా ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు, ప్రజలకు తెలియజేసే అవకాశం ఉందన్నారు.

క్రీడాకారుడికి ఘన స్వాగతం



గుడ్లవల్లేరు: స్కేటింగ్ రోల్‌బాల్ క్రీడాకారుడు మోటపర్తి శ్రీశాంత్‌కు గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు శివారు కొండిపాలెం వాసులు ఘన స్వాగతం పలికారు. కెన్యాలో జరిగిన పోటీల్లో విజేతగా భారత జట్టు విజయం సాధించటంలో కీలక పాత్ర పోషించిన శ్రీశాంత్‌ను గ్రామంలో ఘనంగా సన్మానించారు. తల్లిదండ్రులతో కలిసి శ్రీశాంత్ స్వగ్రామానికి ఊరేగింపుగా వచ్చారు. కెన్యాలో జరిగిన స్కేటింగ్ రోల్‌బాల్ పోటీల్లో ఈ గ్రామానికి చెందిన మోటపర్తి శ్రీశాంత్ మనదేశం తరపున తలపడి భారత్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. శ్రీశాంత్‌ను సన్మానించిన వారిలో గ్రామ ప్రముఖులు కేశన మహేష్, మన్నెం వీరయ్య, పామర్తి శ్రీను ఉన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ



పామర్రు: పామర్రు టౌన్‌లో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోమవారం పరామర్శించారు. స్థానిక విష్ణాలయం వద్ద కొల్లి లక్ష్మీరెడ్డి సతీమణి సత్యవతి ఈనెల 6వ తేదీన మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులను అనిల్‌కుమార్ పరామర్శించారు. అరండాల్‌పేటలో చౌదరి నాగేంద్రం బంధువు మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. రంభా వెంకటేశ్వరరావు కుమారుడు ఖ్యాతి తేజ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అల్లూ సత్యం అత్త పార్వతి మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబాన్ని అనిల్ పరామర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు అప్పిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిథిల భవనం తొలగించండి మహాప్రభో!

ప్రమాదకరంగా జెడ్పీ స్కూల్ ఆఫీసు భవనం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాల ఆఫీసు భవనం శిథిలదశకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తోట్లవల్లూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆఫీసు భవనం శిథిలావస్థకు చేరింది. భవనం నిర్మించి అనేక ఏళ్లు గడుస్తుండటంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. భవనం గోడలు, శ్లాబు, పిల్లర్ల కాంక్రీట్ పెచ్చులూడి తరచూ కింద పడటంతోపాటు ఇనుప చువ్వలు సైతం బయటపడుతున్నాయి.

ప్రమాదకర భవనంలో..

ప్రమాదకరంగా మారిన పాఠశాల ఆఫీసు భవనంలో హెచ్ఎం గది, రైటర్ రూమ్, లైబ్రరీ, ఎన్ఎస్ ల్యాబ్ ఇటీవల వరకు కొనసాగాయి. కొన్ని రోజుల క్రితం వీటిని పాఠశాలకు చెందిన వేరే గదుల్లోకి మార్పు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రాకపోకలు కూడా ఈ భవనం కింద నుంచే ఎక్కువగా జరుపుతుంటారు. ప్రమాదకర భవనం కింద నుంచి రాకపోకలు సాగించటం భయంగా ఉంటోందని ఉపాధ్యాయులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం తగదు..

పాఠశాల ఆఫీసు భవనం ప్రమాదకరంగా మారినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించటం లేదు. ప్రమాదం జరిగిన తరువాత హడావుడి చేసే కంటే ముందే మేల్కొని పాత భవనం తొలగించి, నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పాఠశాల ఆఫీసు నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శిథిల దశకు చేరిన పాఠశాల ఆఫీసు భవనం



ఊడి పడిన శ్లాబు పెచ్చులు

డీఈఓ దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాల ఆఫీసు భవనం శిథిల దశకు చేరిన మాట వాస్తవమే. ప్రస్తుతానికి దీనిలో నడుస్తున్న ఎన్ఎస్ ల్యాబ్, లైబ్రరీ, ఆఫీసును వేరే భవనంలోకి మార్పు చేశారు. శిథిల దశకు చేరిన ఆఫీసు భవన సమాచారాన్ని డీఈఓ కార్యాలయానికి నివేదించాం.

– సురేష్, ఎంఈఓ-2, తోట్లవల్లూరు

కార్మిక సంఘాల సమ్మెకు కౌలు రైతుల మద్దతు

మొవ్వ: దేశ వ్యాప్తంగా ఈనెల 9వ తేదీ నిర్వహించనున్న కార్మిక సంఘాల సమ్మెకు ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు మద్దతు తెలుపుతున్నట్లు కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు తెలిపారు. సోమవారం మొవ్వ మండలం చినముత్తేవిలో శీలం నారాయణరావు ఆధ్వర్యంలో కౌలు రైతులు కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు. ఈనెల 9న ఉదయం 10 గంటలకు మండలంలో ఉన్న పెదపూడి వంతెన సెంటర్ నుంచి కూచిపూడి సెంటర్ వరకు జరిగే కార్మిక, కర్షక సంఘాల ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చినముత్తేవి కౌలు రైతు సంఘం అధ్యక్షుడు నాగ బసవయ్య, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

గుడివాడరూరల్: శ్రీకృష్ణయాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్ 4వ లైన్‌లోని మోడల్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ పామర్రుకు చెందిన శిల్ప రెడీమేడ్స్ యజమాని గుంటక శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు పుస్తకాలు, సామగ్రి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు బొగ్గరపు తిరుపతయ్య, కాగిత షణ్ముఖరావు, జాజుల తాతారావు, స్కూల్ హెచ్ఎం అరవింద్, ఉపాధ్యాయురాలు అర్పిత సింధూజ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ముదినేపల్లికి చెందిన విద్యాసంస్థ నిర్వాహకుడు బొర్రా చలమయ్య ఆర్థిక సాయంతో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో శోభనాద్రిచౌదరి, బొంగు రవి, కోడూరి శేషుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్య కళాశాల ఎచీవర్స్ డే

గుడివాడ టౌన్: గుడివాడ ఆదిత్య కళాశాల ఉన్నత విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు పెద్ద సంఖ్యలో కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందడం అభినందనీయం అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదిత్య కళాశాల 2024–25 ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఎచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ గత ఏడాది ఈ కళాశాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులలో 96 మంది వెంటనే ఉద్యోగ అవకాశాలు పొందడం కళాశాల యొక్క గొప్పదనానికి నిదర్శనం అన్నారు. కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.ఉష, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

14 వరకు పశుగ్రాస వారోత్సవాలు

మండవల్లి: సోమవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ డీవీ వరప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో రైతులకు అవగాహన శిబిరాలను నిర్వహించి పశుగ్రాసం ప్రాముఖ్యతను, పశుగ్రాస నిర్వహణ పద్ధతుల శాస్త్రీయ ప్రాముఖ్యతను వివరించనున్నట్లు పేర్కొన్నారు. మెరుగైన పశుగ్రాసాన్ని రైతులు పండించేందుకు తగు సూచనలు సలహాలు అందజేస్తారని తెలిపారు. పశుగ్రాస కొరతను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి పనికి ఆహార పథకంలో భాగంగా వ్యక్తిగత భూముల కింద బహువార్షిక పశుగ్రాసాల పెంపకానికి అనుమతించినట్లు పేర్కొన్నారు. అధిక దిగుబడినిచ్చే సూపర్ నేపియర్ గినీ గ్రాస్ రకాలను ఎక్కువగా సాగుచేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు పేర్కొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి

కలిదిండి (కైకలూరు): ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని కలిదిండి వైఎస్సార్ సీపీ ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం కలిదిండి మీటింగ్ హాల్లో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర మండల ప్రగతిని ముందుగా వివరించారు. అనతరం ఎంపీపీ చందన మాట్లాడుతూ వర్షాకాలంలో అంటు వ్యాధుల నివారణకు ఆరోగ్యశాఖ ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కొందరు ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలో రహదారులు దెబ్బతిన్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ప్రాధాన్యత క్రమంలో రహదారులు నిర్మిద్దామని ఎంపీపీ బదులిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.కనకదుర్గారాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, డీసీ చైర్మన్లు, నీటి సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరరావు

సంక్షిప్త వార్తలు

ఏఎస్ఐకు సత్కారం

పామర్రు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తూ గుడ్లవల్లేరుకు బదిలీపై వెళ్లిన వెంకటేశ్వరరావును సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ సుభాకర్ మాట్లాడుతూ అందరితో మంచిగా మెలగుతూ స్టేషన్‌కు వచ్చిన వారి అవసరాలను తెలుసుకుని వారికి తగువిధంగా సహాయ పడే మంచి గుణం ఉన్న వ్యక్తి వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్టేషన్‌కు ఉన్నత సేవలను అందించిన వెంకటేశ్వరరావు సేవలు నిరుపమానమన్నారు.

బ్యాంకు రుణాలు, డ్రోన్ల సబ్సిడీపై సమీక్ష

మండవల్లి: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో వ్యవసాయశాఖ రైతులకు అందించాల్సిన బ్యాంకు రుణాలు, డ్రోన్ల సబ్సిడీపై స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండవల్లి, కైకలూరు సబ్ డివిజన్ల సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి ఆధ్వర్యంలో ఆ కార్యక్రమం జరిగింది. ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: పెద విరివాడ, మండవల్లి 33/11 కేవి సబ్ స్టేషన్ విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా నందివాడ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం పెద విరివాడ, దండిగానపూడి, కుదరవల్లి, ఇలపర్రు, లక్ష్మీ నరసింహపురం, రామాపురం, వెన్ననపూడి, తుమ్మలపల్లి, అరిపిరాల తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం

పమిడిముక్కల: స్థానిక హైస్కూల్లో పనిచేసి ఇటీవల జరిగిన బదిలీల్లో వివిధ పాఠశాలలకు వెళ్లిన హెచ్ఎం కేశవనారాయణ, ఉపాధ్యాయులు అరుణ, కోటేశ్వరరావును విద్యా కుటుంబం తరపున సోమవారం సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.దుర్గాభవాని, ఉపాధ్యాయులు శ్రీకుమార్, రామకృష్ణ, రామాంజనేయులు, పీడీ నారాయణ పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయండి

పమిడిముక్కల: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై మంగళవారం పామర్రులో జరిగే నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మండల నాయకులు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులను కలుసుకుని సమావేశానికి అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల వంశీకృష్ణ, నాయకులు రాంబాబు, బుజ్జి, కనుమూరి వెంకటేశ్వరరావు, రాము, శ్రీను పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే కైలే పర్యటన వివరాలు

పామర్రు: మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మంగళవారం ఉదయం 9 గంటలకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమంలో పాల్గొంటారని మాజీ ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది సోమవారం తెలిపారు. అనంతరం పామర్రు సెంటర్, పాల సేకరణ కేంద్రం, యలమర్రు రోడ్డు వద్ద, మార్కెట్ యార్డు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో జరిగే బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీపై నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య' (నాని), అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.

ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్

ముదినేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా మండలంలోని చిగురుకోటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోమటి విష్ణువర్ధన్ నియమితులయ్యారు. ఈ మేరకు మహాసభ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విష్ణువర్ధన్ నియామకంపై మండలంలోని ముదిరాజ్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విష్ణువర్ధన్ ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 దరఖాస్తులు

గుడివాడ టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎనిమిది దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాదు, ఎకౌంట్స్ ఆఫీసర్ జీటీ నాయుడు, ఏసీపీ వి.ఏసుబాబు, మున్సిపల్ మేనేజర్ బి. నిర్మలకుమారి పాల్గొన్నారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు

గుడివాడ టౌన్: కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో చేరేందుకు మొదటి కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని కేబీఆర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఓ.మంజులా దేవి సోమవారం తెలిపారు. 8, 10 తరగతులు ఉత్తీర్ణులైన వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని 17వ తేదీ లోగా అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తిచేసుకోవాలని తెలిపారు. గుడివాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వివరాలకు 08674–295953, 82975 74757ను సంప్రదించాలని కోరారు.

దివ్వెలకు రావూరి భరద్వాజ పురస్కారం



ముదినేపల్లి రూరల్: డాక్టర్ రావూరి భరద్వాజ ద్వితీయ రాష్ట్ర స్థాయి స్మారక పురస్కారానికి మండలంలోని బొమ్మినంపాడు శివారు కొత్తమాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు దివ్వెల వెంకటనరసయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యనారాయణ నుంచి నరసయ్య పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగినట్లు దివ్వెల తెలిపారు.

ఎరువుల నిల్వల వివరాలు ప్రదర్శించండి

కైకలూరు: ప్రతి ఎరువుల దుకాణంలో నిల్వలను రైతులకు కనిపించే విధంగా బోర్డుల ద్వారా ప్రదర్శించాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా సూచించారు. కైకలూరులో ఏ టూ జడ్, వాసవీ ఆక్వా దుకాణాల్లో సోమవారం తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు అమ్మకాల తర్వాత బిల్‌ను కచ్చితంగా అందించాలన్నారు. కైకలూరు ఏఓ ఆర్.దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నాట్య ఇలవేల్పు బాలమ్మకు ఆషాఢ సారె



కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలో నాట్యాచార్యుల ఇలవేల్పు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలోని బాలమ్మకు కూచిపూడి వాసవి వనిత క్లబ్ మహిళలు ఆషాఢ సారెను సోమవారం సమర్పించారు. కూచిపూడి, పెదపూడి చెందిన మహిళలు ఆలయానికి ఊరేగింపుగా విచ్చేసి అర్చకుడు పెనుమూడి సతీష్‌కుమార్‌శర్మకు నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ పండ్లు గాజులు పూజా సామగ్రి అందజేశారు. తొలుత పెదపూడిలోని సంపత్ వినాయకుని గుడిలో, కూచిపూడిలోని గంగానమ్మకు సారె సమర్పించారు.

రాజశేఖరా.. నీ మేలు మరువం!

నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి

కైకలూరు: రాజన్నా.. నీవు ప్రజల గుండెల్లో పదిలం.. నీ చెరగని చిరునవ్వు పేదోడి జీవితాలకు మేలుకొలుపు.. చిరస్థాయిగా ఉంటావన్నా.. అంటూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో లబ్ధిపొందిన ప్రజల అభిమానం ఇది. ఆయన జయంతిని కైకలూరు నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

కొల్లేరు ప్రజలపై ప్రేమ

కొల్లేరు ప్రజల చిరకాల కలగా మిగిలిన సర్కారు కాల్వపై వారధి నిర్మాణానికి రూ.12 కోట్లు వైఎస్సార్ కేటాయించారు. ఆయన మరణాంతరం పనులు నిలిచాయి. తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో వారధి నిర్మాణాన్ని అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఏలూరు జిల్లా పార్టీ ఇన్‌చార్జి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పూర్తి చేశారు. అదేవిధంగా కైకలూరు నియోజకవర్గంపై వైఎస్సార్‌కు అమితమైన ప్రేమ ఉండేది. అప్పటి ఎమ్మెల్యే యెర్నేని రాజారామచందర్‌తో అత్యంత చనువుగా ఉండేవారు. కైకలూరులో మాజీ ఎమ్మెల్యే, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆ సమయంలో కైకలూరు సర్పంచ్‌గా ఉన్నారు. కైకలూరు ఫైర్‌స్టేషన్ సమీప నివాస యానాదులకు భూమిని కేటాయించడానికి సాంకేతిక అడ్డంకులు ఏర్పడ్డాయి. ఏకంగా అసెంబ్లీలో ఆర్డినెన్సును తీసుకొచ్చి పేదలకు స్థలాలు వైఎస్సార్ ఇప్పించారు.

వైఎస్సార్ పాదస్పర్శతో పులకించిన అభివృద్ధి

గుడ్లవల్లేరు: 2008లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి గుడ్లవల్లేరులో అడుగు పెట్టడంతో అభివృద్ధి ఆ మండల ప్రజలు ఊహించని విధంగా జరిగింది. ఆ అభివృద్ధే పులకించేలా చేసిన ఆ జన హృదయ నేతను ఈనాటికీ ప్రజలు తలచుకుంటూనే ఉంటున్నారు. వైఎస్సార్ తన హయాంలో 2008లో రూ.14కోట్ల ప్రభుత్వ నిధులతో గుడ్లవల్లేరు ప్రాంతానికే తలమానికమైన వైఎస్సార్ బ్రిడ్జిని నిర్మించారు. వైఎస్సార్‌లో తొలి అక్షరంలో ఈ 'వై' ఆకారపు వంతెన వలన ఎంఎన్‌కే రహదారికే గాక భీమవరం – మచిలీపట్నం ప్రధాన రహదారిలో రాకపోకలకు ఎంతో దోహదపడుతుంది. రూ.51 లక్షలతో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆ మహానేత బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి ప్రారంభానికి వచ్చిన మహానేత ఈ ప్రాంతంలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులను చూసి చలించిపోయారు. ఆ రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించేందుకు రూ.40 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కేటాయిస్తూ... బ్రిడ్జి ప్రారంభం అనంతరం బహిరంగ సభా వేదికపైనే సంతకం చేసిన ఘనత ఆయనది. గ్రామంలో మంచినీటి పథకానికి దాదాపు రూ.25లక్షల నిధులను వైఎస్ ప్రభుత్వం కేటాయించింది.



గుడ్లవల్లేరు వద్ద సభలో వైఎస్సార్ సమక్షంలో పార్టీలో చేరిన ప్రస్తుత ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు డీఎన్నార్ (ఫైల్)



గుడ్లవల్లేరులో బ్రిడ్జి భూమిపూజకు వచ్చిన వైఎస్సార్‌కు స్వాగతం పలుకుతున్న వేద పండితులు (ఫైల్)


సమస్య పరిష్కారమే వైఎస్సార్ బాట



ప్రజలు ఎదుర్కొంటున్న ఒక సమస్య వైఎస్సార్ దృష్టికి వచ్చినా ఆ సమస్య పరిష్కారించేందుకు వ్యవహరిస్తారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ప్రారంభానికి ఆయన వచ్చారు. ఆయన రెండుసార్లు వచ్చేసరికే గుడ్లవల్లేరు రూపురేఖలే మారిపోయాయి.

– పడమటి సుజాత, కేడీసీసీ మాజీ డైరెక్టర్, కౌతవరం

వైఎస్సార్ అడుగు పెట్టడంతోనే అభివృద్ధి



గుడ్లవల్లేరులో వైఎస్సార్ అడుగు పెట్టారు. అంతే కోట్ల రూపాయల వంతెన వచ్చింది. రోడ్ల నిర్మాణాలకు నిధులు వచ్చాయి. మంచినీటి పథకానికి కావలసిన నిధులన్నీ సమకూరాయి. ఆ మహానేతను ఒక్క గుడ్లవల్లేరే కాకుండా మండల ప్రజలు మరువలేరు. ఆయన అభివృద్ధి పట్ల చూపించిన చొరవ ఈనాటికీ మరువలేనిది.

– బలుసు జితేంద్ర, వైఎస్సార్ సీపీ మండల బూత్ కమిటీల అధ్యక్షుడు, వడ్లమన్నాడు

స్మార్ట్ మీటర్లపై అవగాహన

- వ్యతిరేకించిన గుడివాడ ఆటోనగర్ కమిటీ
- అధికంగా బిల్లులు వస్తున్నాయని ఫిర్యాదు

గుడివాడరూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల వాడే విధానంపై ఆటోనగర్‌లో అవగాహన సదస్సును విద్యుత్ అధికారులు సోమవారం నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గేందుకు ఏ విధంగా ఉపయోగించే దానిపై అధికారులు అవగాహన కల్పించడాన్ని గుడివాడ ఆటోనగర్ కమిటీ వ్యతిరేకించింది. కమిటీ గౌరవాధ్యక్షుడు టి.లక్ష్మణరావు మాట్లాడుతూ 1970లో ఆటోనగర్ ఏర్పడిందని అప్పటి నుండి ఎప్పుడు విద్యుత్ సమస్య తీవ్రంగా లేదని ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు వివరించారు. ప్రతి నెలా చిన్న పరిశ్రమకు రూ.3వేలు బిల్లు వచ్చేదని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన తర్వాత ప్రతి నెలా రూ.15వేలకు పైగా బిల్లు వస్తుందని తెలిపారు. దీని వల్ల చిన్న పరిశ్రమలు మూతపడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని ఆయన కోరారు.



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

ఉత్తమ విద్యార్థులకు విద్యారత్న అవార్డులు

పమిడిముక్కల: విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా మండలంలోని గురజాడలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ ఆధ్వర్యంలో విద్యారత్న అవార్డుల అందజేత కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆర్టీఐ రాష్ట్ర కో కన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 19 మంది విద్యార్థులకు విద్యారత్న అవార్డులు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీఐ రాష్ట్ర కన్వీనర్ దాసరి ఇమ్మానుయేలు, ఉయ్యూరు సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి జంపాన కొండలరావు, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

పమిడిముక్కల: మండలంలోని పెనుమత్సలో ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మందా కృష్ణమాదిగ జన్మదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి దినేష్, నియోజకవర్గ అధ్యక్షుడు కొల్లూరి దినేష్, సర్పంచ్ అచ్చమాంబ పాల్గొన్నారు.